

సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం

సర్కారు దవాఖానాలకు బ్రాండింగ్

- మెరుగైన సేవలకు అవసరమైన సౌకర్యాల కల్పన
- ఆకర్షణీయంగా కనపడేలా మెరుగులు
- ఉమ్మడి జిల్లాలో 8 ఆస్పత్రుల ఎంపిక
- రెండు నెలల్లో పూర్తి చేయాలని నిర్దేశం
- నేటి నుంచి ఆస్పత్రులకు ఇంజనీరింగ్ అధికారులు

సంగారెడ్డి అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : సర్కారు దవాఖానాలకు 'బ్రాండింగ్' చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సమస్యలను పరిష్కరించి, మెరుగైన సేవలందించేందుకు అవసరమైన సౌకర్యాలను కల్పించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సంకల్పించింది. దీనిపై హైదరాబాద్‌లోని వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు రాష్ట్రంలోని అన్ని సర్కారు ఆస్పత్రుల అధికారులు, టీజీఎంఎస్ఐడీసీ అధికారులతో సోమవారం సమీక్షించి కార్యాచరణ రూపొందించారు. సర్కారు తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎనిమిది ఆస్పత్రుల దశ మారనుంది.

ఉమ్మడి జిల్లాలో ఎనిమిది ఆస్పత్రులు

బ్రాండింగ్ ప్రక్రియలో భాగంగా మొదటి దశలో చేపట్టే పనులకు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎనిమిది ఆస్పత్రులను ఎంపిక చేశారు. ఇందులో డీఎంఈ కింద ఉన్న దవాఖానాలు మూడు, టీవీవీపీ కింద ఉన్న ఆస్పత్రులు ఐదు ఎంపికయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో నాలుగు, మెదక్ జిల్లాలో రెండు, సిద్దిపేట జిల్లాలో రెండు ఆస్పత్రులను ఎంపిక చేశారు. సంగారెడ్డి జిల్లాలోని జీజీహెచ్ సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. మెదక్ జిల్లాలో మెదక్ జనరల్ హాస్పిటల్, నర్సాపూర్ ఏరియా ఆస్పత్రి, సిద్దిపేట జిల్లాలోని జీజీహెచ్ సిద్దిపేట, గజ్వేల్ ఏరియా ఆస్పత్రులున్నాయి. టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో ఆయా ఆస్పత్రుల్లో ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు.

చేపట్టే పనులు ఇవే..

ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో భద్రతా నిబంధనల ప్రకారం ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ, డ్యూటీ రూమ్, సీసీటీవీ, సెక్యూరిటీ అవుట్‌పోస్ట్, రెడ్అలారం ఏర్పాటు చేస్తారు. పేషెంట్లకు కల్పించే సౌకర్యాల్లో భాగంగా టాయిలెట్స్, క్యాంటీన్, డ్రింకింగ్ వాటర్, రిసెప్షన్ ఏరియా, బయోమెడికల్ వేస్ట్ డిస్పోసల్, ల్యాండ్‌స్కేపింగ్, ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్, డ్యాష్ బోర్డులు, ఓపీ, ఫార్మసీ, డయాగ్నోస్టిక్ ప్రత్యేక కౌంటర్లు, నిర్మాణాత్మక మరమ్మతులు, రోగులకు స్పష్టంగా తెలిసేలా గుర్తులు ఏర్పాటు చేస్తారు. డీఎంఈ పరిధిలోని జనరల్ ఆస్పత్రుల్లో ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం

మిగతా 7వ పేజీలో



మెదక్-ఎల్కతుర్తి హైవే నిర్మాణంలో భాగంగా పందిల్ల వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు నత్తనడకన సాగుతున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఫోకస్

పెద్దరోడ్డు ఇంకెప్పుడో?

మెదక్ జిల్లా కేంద్రం నుంచి హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2022 నవంబరులో ప్రారంభమైన ఈ పనులు నేటికీ కొలిక్కిరాలేదు. రెండేళ్లలో పూర్తికావాల్సిన పనులు.. మరో ఆరు నెలలైనా పూర్తయ్యేలా కనిపించట్లేదు. అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఎక్కడా హెచ్చరికలు, సూచికబోర్డులు లేకుండానే అస్తవ్యస్తంగా పనులు కొనసాగిస్తున్నారు. అసంపూర్తి నిర్మాణాలతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఇప్పటికే పలువురు మృత్యువాత పడ్డారు. ఈ రహదారి నిర్మాణ పనులను మంగళవారం 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలించగా పలు విషయాలు వెలుగుచూశాయి.

- కొనసాగుతున్న మెదక్-ఎల్కతుర్తి హైవే పనులు
- పర్యవేక్షణ లోపంతో ఇష్టారాజ్యంగా 133 కి.మీ.ల రోడ్డు నిర్మాణం
- అసంపూర్తిగా పనులు.. తరచూ రోడ్డు ప్రమాదాలు
- ఇప్పటికే పలువురి మృత్యువాత.. అయినా మారని తీరు
- హెచ్చరికలు, సూచికబోర్డులు లేకుండానే పనుల నిర్వహణ



రామాయంపేట మండలం అక్కన్నపేట వద్ద సైడ్ డ్రెయిన్‌లో పడిపోయిన లారీ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి), మే 20 : మెదక్ నుంచి సిద్దిపేట మీదుగా ఎల్కతుర్తి వరకు ఉన్న రహదారికి మూడేళ్ల క్రితం జాతీయ హోదాను కల్పిస్తూ హైవే 765-డీజీ నంబరును కేటాయించారు. విస్తరణ పనులు చేపట్టడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ రహదారిని రెండు ప్యాకేజీలుగా విభజిస్తూ టెండర్లు నిర్వహించి పనులు కూడా చేపట్టారు. ఒకటో ప్యాకేజీలో మెదక్ నుంచి సిద్దిపేట వరకు 70కి.మీ.లకు రూ.882 కోట్లు, రెండో ప్యాకేజీలో సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి వరకు 63 కి.మీ.ల రహదారి నిర్మాణానికి రూ.578 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ కరువు

జాతీయ రహదారి పనులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడినట్లు స్పష్టవుతోంది. పనులు ప్రారంభమైన నాటి నుంచే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్రమపద్ధతిలో కాకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనుల నిర్వహణతో దుమ్మూదూళి

మిగతా 7వ పేజీలో



మిస్సమ్మ

ఈనెల 18న ఓ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన మిస్ తెలంగాణ పోటీల్లో జిల్లా యువతి ప్రతిభ చాటింది. ఈ పోటీల్లో మిస్‌రెడియన్స్ లుక్ ఆఫ్ తెలంగాణ మిస్ ఫొటోజెనిక్ విభాగంలో అక్బర్‌పేట- భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన తుమ్మల ఆర్తీ ప్రథమస్థానంలో నిలిచింది. ఆర్తీ హైదరాబాద్‌లో ఆర్కిటెక్‌గా పనిచేస్తుంది. తల్లిదండ్రులు ముంబై వలస వెళ్లారు. ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. అందాల పోటీల్లో విజేతగా నిలిచి మంగళవారం స్వగ్రామానికి విచ్చేసిన ఆర్తీకి బంధువులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.

- మిరుదొడ్డి, మే 20 (ఆంధ్రజ్యోతి)

చెత్త చెత్త..

- కంపు కొడుతున్న మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు
- ఎటూ తేలని విలీనం పంచాయతీ
- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు
- తమకేం సంబంధం అంటున్న మున్సిపల్ అధికారులు
- 6నెలలుగా పారిశుధ్య కార్మికుల వేతనాలు నిలిపివేత
- ట్రాక్టర్లలో డీజిల్ పోసినా కార్మికులు రాకపోవడంతో నిలిచిన చెత్త సేకరణ
- రోడ్లపై పారేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు
- మున్సిపలా... పంచాయతా తేల్చాలంటున్న నిర్వాసితులు

మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు చెత్త.. కంపుతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఆరు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఆపేయడం, పంచాయతీలకు సంబంధించిన బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేయడంతో పంచాయతీ కార్యదర్శులు గ్రామాలను పట్టించుకోవడం లేదు. పారిశుధ్య కార్మికులు కూడా ఏ పనులు చేయడం లేదు. ఇళ్లలోనే చెత్త పేరుకుపోతుండడంతో ప్రజలు కవర్లలో, బస్తాల్లో మూటలు కట్టి రోడ్లపై పడేస్తున్నారు. ఎక్కడ చూసి చెత్తనే దర్శనమిస్తుంది. పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోక, వేతనాలు అందక పారిశుధ్య కార్మికులు విధులకు హాజరుకాకపోవడం, కార్మికులు లేక ట్రాక్టర్‌ను మున్సిపల్ అధికారులు నిలిపివేయడంతో గ్రామాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోకపోవడంతో తమ పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదని మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

గజ్వేల్, మే 20 (ఆంధ్రజ్యోతి)

మల్లన్నసాగర్ భూనిర్వాసిత గ్రామాలు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోకి చేరి దాదాపు నాలుగేళ్లు అవుతుంది. మూడేళ్ల క్రితం వరకు ఆయా గ్రామపంచాయతీల పాలకవర్గాలు పాలనను చూసుకున్నాయి. కానీ ఏడాది క్రితం సర్పంచుల, ఎంపీటీసీల పదవీకాలం పూర్తి కావడంతో కార్యదర్శులపై భారం పడింది. ఈ క్రమంలోనే ఆరు నెలల క్రితం పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాలకు చెందిన గ్రామపంచాయతీ అకౌంట్లను డీపీవోకు అందజేయడంతో పాటు వాటిని సీజ్ చేశారు. అకౌంట్లను సీజ్ చేయడంతో.. గడిచిన ఆరు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఆరు నెలలపాటు వేచి చూసిన పారిశుధ్య కార్మికులు గడిచిన పది రోజుల నుంచి తమ విధులను నిలిపివేశారు. దీంతో ఇళ్లలోనే చెత్త పేరుకుపోయింది. మున్సిపాలిటీలోని నిర్వాసిత కాలనీలు అసలు మున్సిపాలిటీలోకి వెళ్తాయా... లేక పంచాయతీలుగా కొనసాగుతాయా అన్న అంశంపై ప్రభుత్వం ఆసక్తి కనబరచకపోవడంతో ఇటు మునిసిపాలిటీ పట్టించుకోక.. పంచాయతీరాజ్ అధికారులు వదిలివేయడంతో నిర్వాసిత గ్రామాల ప్రజలు పారిశుధ్య సమస్యను ఎదుర్కొంటున్నారు.

గెజిట్ రాలేదంటున్న మున్సిపల్ అధికారులు

మల్లన్నసాగర్ భూనిర్వాసిత గ్రామాలైన సింగారం, ఎర్రవల్లి, పల్లెపహాడ్, వేములఘాట్, ఏటిగడ్డ కిష్టాపూర్, లక్ష్మాపూర్, బ్రాహ్మణ బంజరుపల్లి, రాంపూర్ గ్రామాలు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చి చేరి నాలుగేళ్లు అవుతుంది. ఈ క్రమంలో ఇటీవల పంచాయతీరాజ్ ఎన్నికల ర్యాండమైజేషన్ ప్రక్రియను సైతం నిర్వాసిత గ్రామాల్లో చేపట్టకపోవడంతో పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోవడం మానేశారు. దాదాపు ఈ గ్రామాల పరిధిలో 33 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వారికి జీతాలు రాకపోవడం, డీజిల్ పోయించడానికి మున్సిపల్ అధికారులు సిద్ధంగా ఉన్నా కార్మికులు లేని కారణంగా ట్రాక్టర్ నడపడానికి వీలు లేకుండా పోయింది. కానీ విలీనానికి సంబంధించిన గెజిట్ రాలేదని మున్సిపాలిటీలో విలీనంపై తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

మిగతా 8వ పేజీలో



మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీకి వెళ్లే రోడ్లపై చెత్త కుప్పలు

గొంతులో ఇరుక్కున్న ఎముక

- కాసేపటికే అన్నవాహికలోకి..
- ఆర్‌వీఎం ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స
- కడుపులో నుంచి ఎముక తొలగింపు



వివరాలను వెల్లడిస్తున్న వైద్యులు

ములుగు, మే 20 (ఆంధ్రజ్యోతి): అన్నం తింటుండగా ఎముక కడుపులోకి చేరి తీవ్ర ఇబ్బంది పెట్టడంతో రోగికి అరుదైన శస్త్రచికిత్స చేసి ఎముకను తొలగించి ప్రాణాలను కాపాడారు. ములుగు ఆర్‌వీఎం (రాజబోయిన వెంకటయ్య మెమోరియల్) వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాలకు చెందిన తాడేరి యాదగిరి (65) గత మంగళవారం ఓ శుభకార్యానికి వెళ్లాడు. అక్కడ భోజనం చేసే సమయంలో త్రిభుజాకారం లో ఉన్న ఎముకను మింగాడు. మొదట గొంతులో ఇరుక్కోగా ఇబ్బంది పడుతూనే నీళ్లు తాగాడు. కాసేపటికి ఎముక గొంతు ద్వారా అన్నవాహిక వద్దకు వెళ్లి నిలిచిపోయింది. ఈ క్రమంలో ఆయన శ్వాసపరమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కడుపు నొప్పి తీవ్రం కావడం, ఆహారం అరగకపోవడం తదితర సమస్యలతో బాధపడ్డాడు. కుటుంబీకులు ఆయనను ములుగు ఆర్‌వీఎం (రాజబోయిన వెంకటయ్య మెమోరియల్) ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంబంధిత శాఖ హెచ్‌వోడి డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ అభిషేక్, డాక్టర్ వరుణ్, డాక్టర్ భావన, డాక్టర్ శ్రీనివాస్ బృందం రోగి యాదగిరికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అన్నవాహిక చివర త్రిభుజాకారంలో ఉన్న ఎముక ఉన్నట్లు గుర్తించారు. రోగి అత్యవసర పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని సమస్య పరిష్కారానికి అధునాతనమైన నూతన సాంకేతికతను వినియోగించి ఓవిఎస్కో శస్త్రచికిత్స ద్వారా వైద్యుల బృందం సురక్షితంగా ఎముకను తొలగించారు. తమ ఆసుపత్రిలో అపార అనుభవం, నిష్ణాతులైన వైద్యులచే ఎన్నో క్లిష్టమైన ఆపరేషన్‌లు విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ యాదయ్య, సీఈవో దేవరకొండ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ముఖ్యంగా రోగి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఉచితంగా కార్పోరేట్ స్థాయి వైద్యం అందించగా, లాభాపేక్షతో కాకుండా సేవాభావానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రూ. 15 లక్షల వరకు ఖర్చయ్యే ఈ ఆపరేషన్ ఉచితంగా నిర్వహించినట్లు వారు వివరించారు.

వన్‌టైమ్ చాన్స్

- 2015-20 మధ్యలో డిగ్రీ చదివి ఫెయిలైన వారికి అవకాశం

7

తపాలా.. భళా

- నేటికీ తగ్గని ఆదరణ
- సాంకేతిక పరిజ్ఞానంతో ముందడుగు
- విస్తరిస్తున్న మొబైల్ సేవలు

7

ఐదు గ్రూపుల సభ్యులతో త్రిసభ్య కమిటీ విచారణ

గజ్వేల్, మే 20 (ఆంధ్రజ్యోతి): మెప్మా నిధుల పక్కదారిపై విచారణలో రోజుకో కొత్త ట్విస్ట్ బయటపడుతుంది. నిధుల పక్కదారి అంశంపై త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో గత మంగళవారం మూడు గ్రూపు సభ్యులతో విచారణ చేపట్టగా, తాజాగా ఐదు గ్రూపుల(రవి చంద్రిక, రీలేశ్వరీ, సరస్వతీబాయి, బాలాజీ, చైతన్య గ్రూపు) సభ్యులతో కలిసి మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రూపులకు సంబంధించిన పొదుపు సొమ్ము ను సైతం ఖాళీ చేసినట్లుగా గుర్తించినట్లు ఆడిటర్ జయశ్రీ తెలిపారు. గ్రూపు సభ్యులు నెలకు రూ.100, రూ.200 చొప్పున జమ చేసుకున్న పొదుపు సొమ్ము సైతం తీసినట్లు గుర్తించామని, ఈ డబ్బును ఎలా పక్కదారి పట్టించారన్న విషయంపై విచారణ చేపడుతున్నామన్నారు. బ్యాంకుల్లో సైతం విచారణ చేపడుతున్నామని తెలిపారు. నగదు ఏ రూపంలో బయటకు వెళ్లిందో... ఏ రూపంలోకి వెళ్లిందో గుర్తించేందుకు మరో మూడు, నాలుగు రోజుల పాటు విచారణ చేపట్టనున్నట్లు చెప్పారు. ఎంత మేర నిధులు పక్కదారి పట్టాయో చెప్పలేమని, ఎనిమిది సంఘాలకు సంబంధించిన నగదులో ఎంత మేర నిధులను మళ్లించారన్న విషయంపై బ్యాంకులో విచారణ చేస్తే బహిర్గతం అవుతుందన్నారు. మూడు, నాలుగు రోజుల్లో పూర్తి స్థాయి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. ఆమెవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు అధికారుల పాత్ర

మెప్మా నిధులు పక్కదారి పట్టడంలో బ్యాంకు అధికారుల పాత్ర ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే రోజులో బ్యాంకు ఖాతాలు తెరవడం, రుణాలను మంజూరీ చేయడం, రుణాలను డ్రా చేయడం ఏంటని... ఇందులో బ్యాంకు అధికారుల పాత్ర సుస్పష్టంగా ఉందని చెబుతున్నారు. తమకు పదివేల ముద్ర రుణాలు కావాలంటే నానారకాల పేపర్లు అడిగే బ్యాంకు అధికారులు రూ. 20, రూ.25లక్షల రుణాలను ఏకకాలంలో తమ సంతకాలు లేకుండా ఎలా ఇతరుల ఖాతాలకు మళ్లించారో అర్థం కావడం లేదని వాపోతున్నారు.



చినజీయర్ స్వామిజీ పర్యవేక్షణ నిర్వహిస్తున్న శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం



కల్యాణమహోత్సవంలో పాల్గొన్న హరీశ్ రావు, రఘునందన్ రావు

కమనీయం శ్రీనివాస కల్యాణం

సిద్దిపేట కల్చరల్/సిద్దిపేట క్రైం మే 20 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలోని పద్మావతి సమేత వేంకటేశ్వర ఆలయ స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ భూనీళా సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. ఈ కల్యాణ క్రతువు చినజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో మాజీమంత్రి, హరీశ్‌రావు, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్, రఘునందన్‌రావుకు చినజీయర్ స్వామిజీ మంగళ శాసనాలు అందించారు. ఉత్సవాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, ఆలయ నిర్వాహకు లు, అధికారులు, డైరెక్టర్లు, అర్చకులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి మంగళవారం చినజీయర్ స్వామి విచ్చేశారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆయన సతీమణి శ్రీనిత ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు పాదపూజ చేశారు.

అప్పు తీర్చాలని సొంత చెల్లి ఇంటికే తాళం వేసిన అన్న

- బావపై దాడి చేయడంతో మనస్తాపంతో అదృశ్యం
- ఈ నెల 17న ఘటన.. అప్పటి నుంచి బిడ్డతో కలిసి ఆరుబయటే ఉంటున్న మహిళ
- మంగళవారం పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు


ఇంటికి తాళం వేయడంతో బయట ఉన్న గీత , గణేష్ (ఫైల్)

శివ్వంపేట, మే 20(ఆంధ్రజ్యోతి) : తీసుకున్న అప్పు తీర్చడం లేదని తోడబుట్టిన చెల్లెలు ఇంటికి తాళం వేయడంతోపాటు బావపై దాడి చేశాడు ఓ వ్యక్తి. దీంతో మనస్తాపం చెందిన బావ అదృశ్యమయ్యాడు. బాధిత మహిళ, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధి లోని దొంతి గ్రామానికి చెందిన గోత్రాల గణేష్ ఐదేళ్ల క్రితం ఇంటి నిర్మాణం కోసం తన బావమరిది గోత్రాల బాల్ నర్సయ్య వద్ద 1.50 లక్షలు అప్పు తీసుకున్నాడు అప్పు తీర్చే మార్గం లేక గణేష్ ఈ నెల 17న ఉదయం మస్కట్ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. విషయం తెలుసు కున్న బాల్ నర్సయ్య అతడి ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వమని అడగడంతో పాటు బావపై దాడి చేసి ఇంటికి తాళం వేశాడు. దీంతో మనస్తాపం చెందిన గణేష్ బయటికెళ్లి తిరిగి రాలేదు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య గీత మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఆరోజు నుంచి గణేష్ భార్య ఇంటి వద్ద ఆరుబ యటనే బిడ్డతో కలిసి ఉంటున్నది. తన అన్న బెదిరింపులకు పాల్పడుతు న్నాడని, అతడితో ప్రాణహాని ఉందని బాధితురాలు తెలిపింది.

ఫర్టిలైజర్ దుకాణంలో అగ్ని ప్రమాదం

- రూ. 3 లక్షల ఆస్తి నష్టం


దగ్ధమైన పత్తి విత్తనాలు

కల్హేర్, మే 20(ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని వాసర్ గ్రామంలోని ఫర్టిలైజర్, విత్తనాల దుకాణంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకు న్నది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పవన్‌రెడ్డి శివశక్తి పేరున ఫర్టిలైజర్, విత్తనాల దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి దుకాణానికి తాళం వేసి వెళ్లిన అనంతరం రాత్రి 12 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటల వ్యాపించి బయటికి పొగ రావడంతో స్థానికులు షాపు యజమానికి సమాచారమం దించారు. షాపు తెరిచి చూసే సరికి పత్తి విత్తనాల ప్యాకెట్లు, కంప్యూటర్లు, ఈ పాస్ మిషన్, ఫర్నీచర్, షాపు లైసెన్స్ పేపర్లు ఇతర నిర్వహణ రికా ర్డులు దగ్ధమయ్యాయి. జరిగిన ఈ ప్రమాదంలో రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు యజమాని పవన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సిర్గా పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రెండు నెలల క్రితం అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం


బాల మల్లవ్వ (ఫైల్)

చిన్నశంకరంపేట మే 20 (ఆంధ్రజ్యోతి): అదృశ్య మైన మహిళ మృతదేహం రెండు నెలల తర్వాత లభ్య మైంది. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలంలోని సూరారం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో చోటుచేసు కుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేట మండలం రజాక్ పల్లి గ్రామానికి చెందిన వజ్జ బాల మల్లవ్వ(55) గత మార్చి నెలలో చిన్నశంకరపేట మండలం బాగిర్తిపల్లి బంధువుల వద్దకు బీరప్ప జాత రకు వచ్చింది. ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బాల మల్లవ్వ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఇరుగుపొరుగు వారిని, బంధువులను అడిగినా ఫలితం దక్కలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నారు. కాగా, మంగళవారం సూరారం గ్రామ శివారు అటవీ ప్రాంతం వైపు వెళ్లిన గ్రామస్థులకు ఓ గుర్తు తెలియని మహిళా మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి వెళ్లిన వారు కుళ్లి పోయి అస్తిపంజరం స్థితిలో లభ్యమైన శవాన్ని పరిశీలించి బాల మల్లవ్వ మృతదేహంగా గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని అక్కడే పోస్టుమార్టం చేసినట్లు ఎస్ఐ నారాయణ గౌడ్ వెల్లడించారు.

రాంపూర్ వద్ద రోడ్డు ప్రమాదం

- మానవత్వాన్ని చాటిన పోలీస్ కళాబృందం


గాయపడిన భార్యాభర్తలను ఆస్పత్రిలో చేర్పిస్తున్న పోలీస్ కళా బృందం

నంగునూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలైన సంఘ టన సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగింది. ఈ ప్రమాదంలో హుస్నా బాద్ మండలం నవీపేట గ్రామానికి చెందిన అనిల్, మౌనిక గాయాలకు గురయ్యారు. రోడ్డు పక్కన ఉన్న గుంతలో భార్యాభర్తలు పడిపోగా ఆ సమ యంలో అక్కన్నపేట మండలంలో పోలీస్ కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల డ్రైవర్ శ్రీనివాస్‌లు విధులు ముగించుకొని వస్తుండగా రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడి ఉన్న భార్య భర్తలను గుర్తించి వారిని వెంటనే సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదానికి గురైన భార్యాభర్తలను పోలీసులు తమ వాహనంలో ఎక్కించుకొని ఆసుప త్రిలో చేర్పించి వారి బంధువులకు సమాచారం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. అర్ధరాత్రి తర్వాత ఆపదలో రక్త గాయాలతో ఉన్నవారిని ఆసుపత్రిలో చేర్పించి వారి బంధువులకు సమాచారం ఇచ్చిన పోలీస్ కళా బృందానికి బాధ్యత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు..

40 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన బియ్యం లారీతో విజిలెన్స్ డీఎస్పీ, సిర్గాపూర్ ఎస్ఐ

కల్హేర్, మే 20 (ఆంధ్ర జ్యోతి) : గుట్టు చప్పుడు కాకుండా లారీలో కర్ణా టక రాష్ట్రానికి తరలి స్తున్న 40 టన్నుల రేషన్ బియ్యం లారీని సీజ్ చేసి డ్రైవర్, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు సిర్గా పూర్ ఎస్ వెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిర్గాపూర్ మండల పరిధి లోని పోచాపూర్ చౌరస్తాలో సోమవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చౌరస్తా మీదుగా వెళ్తున్న కర్ణాటకకు చెందిన లారీని అనుమానం వచ్చి ఆపి తనిఖీలు చేయగా 40 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఈ విషయం పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్ వారికి సమాచారమివ్వడంతో సివిల్ సప్లై డీటీ సాజుద్దీన్, విజిలెన్స్ డీఎస్పీ వెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పట్టుబడిన బియ్యం పరిశీ లించి రేషన్ బియ్యంగా నిర్ధారించారు. వారు ఫిర్యాదు చేయడంతో లారీ ఓనర్ జాకిర్ మియా, డ్రైవర్ అనిల్‌కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

మద్యం లోడు డీసీఎం బోల్తా.. డ్రైవర్ మృతి



హత్నూర, మే 20 (ఆంధ్రజ్యోతి): మద్యం బీరు కాటన్‌ల లోడుతో వెళ్తున్న డీసీఎం అదుపు తప్పి బోల్తా పడగా డ్రైవర్ మృతి చెందిన సంఘటన హత్నూర మండలం చందాపూర్ బస్టేజి సమీపంలో సంగారె డ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పుల్కల్ మండలం శివ్వంపేట గ్రామ శివారులోని బీర్ ఫ్యాక్టరీ నుంచి 1675 రాయల్ చాలెంజ్ బీర్ కాటన్ల లోడుతో కరీంనగర్ లిక్కర్ డిపోకు వెళ్తున్న డీసీఎం ఒక్కసారిగా చందాపూర్ గేటు సమీపంలోని వద్ద ఎదు రుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ ప్రవీణ్ (22) మృతి చెందగా.. క్లీనర్ ముజామిద్ ప్రాణాలతో బయటపడ్డాడు. వీరిద్దరు కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా చింతకి గ్రామానికి చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. విషయాన్ని తెలుసుకొని ఎక్సైజ్ ఎస్ఐ సందీప్‌రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి సైతం సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. డ్రైవర్ మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తర లించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటోను ఢీకొన్న కారు.. ఆటో డ్రైవర్ మృతి


అశోక్ (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): కారు ఆటోను ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ మృతిచెందాడు. వివ రాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అశోక్(20) మంగళ వారం రాత్రి హుస్నాబాద్ నుంచి గట్లనర్సింగాపూర్ గ్రామానికి ఆటో నడుపుకుంటూ వెళ్తున్నాడు. హుస్నా బాద్ మండలం జిల్లెలగడ్డ సమీంలో వరంగల్ నుంచి వస్తున్న కారు అతడిని ఆటోను ఢీకొట్టడంతో అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ మహేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు..

జగదేవ్‌పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని కారు ఢీకొన డంతో వృద్ధుడుమృతి చెందిన ఘటన జగదేవ్‌పూర్ మండలం అల్లిరాజ పేట్, నిర్మల్‌నగర్ గ్రామాల మధ్య మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అలిరాజపేట్ గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింహులు(65) నిర్మల్‌నగర్‌లోని పీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. నిర్మల్‌నగర్ వద్ద మంగళవారం ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి అల్లిరాజపేట్ గ్రామానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొట్టడంతో రెండు కాళ్లు విరిగి అక్క డికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నారు.

గాయాలపాలై చికిత్స పొందుతూ వ్యక్తి ..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చేగుంట, మే 20(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంట మండల రెడ్డిపల్లి బైపాస్ 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లి 44 జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి కారు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి..


రాములు వ్యక్తి మృతదేహం

జోగిపేట రూరల్, మే20(ఆంధ్రజ్యోతి): అందోల్ మండల పరిధిలోని అన్నసాగర్ వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్ఐ పాండు తెలిపిన వివ రాల మేరకు అల్లాదుర్గం మండలం గడిపె ద్దాపూర్ గ్రామానికి చెందిన దానంపల్లి రాములు శుభకార్యానికి ద్విచక్రవాహ నంపై వెళ్తుండా అన్నసాగర్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో రాములు అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడితో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య


రాజు మృతదేహం

తొగుట, మే 20 (ఆంధ్రజ్యోతి): తమ్ముడితో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తొగుట మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచే సుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రామారం రాజు (38)కి తల్లిదండ్రులు 20 ఏళ్ల క్రితమే మృతిచెందారు. అతడికి చెల్లె మమత, తమ్ముడు మహేశ్ ఉండగా ఇరువురికి వివాహం జరిగింది. రాజు మద్యా నికి బానిస కావడంతో అతడికి ఎవరూ పిల్లను ఇవ్వకపోవడంతో ఒంట రిగా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాజు తన తమ్ముడితో చిన్న పాటి గొడవపడ్డాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రాజు జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

జోగిపేట రూరల్, మే20(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువ కుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అందోల్ మండలం సంగుపేట గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ పాండు కథనం ప్రకారం నారా యణఖేడ్‌కు చెందిన బానాపురం రాకేశ్(27) ఆర్థిక ఇబ్బందులతో మన స్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడాడు. మృతుడి తల్లి ముక్తాబాయ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మక్తలక్ష్మాపూర్‌లో పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

హోరాహోరీగా కుస్తీ పోటీలు

పెద్దశంకరంపేట, మే 20(ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేట మండల పరిధిలో మక్తలక్ష్మాపూర్‌లో మాణిక్ ప్రభు జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. పెద్దశంకరంపేట మండల ప్రాంతంతో పాటు కల్హేర్ కమిటీ నారాయణఖేడ్, మనూరు, కర్ణాటక, మహారాష్ట్ర పరిధిలోని మల్ల యోధులు కుస్తీ పోటీలో పాల్గొన్నారు. దీంతో కుస్తీ పోటీలు రసవత్తరంగా మారాయి. లక్ష్మాపూర్ గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పోటీలను తిలకించడానికి తరలివచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

వీ హబ్‌తో గీతం ఒప్పందం



ఒప్పంద పత్రాలపై సంతకం చేస్తున్న ఇరు వర్గాల ప్రతినిధులు

పటాన్‌చెరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం మహిళా వ్యవస్థాపకుల కోసం నెలకొల్పిన వీ హబ్‌తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాయం ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కృతి గుప్తా, వీ హబ్ డైరెక్టర్ (సామాజిక ప్రభావం, వ్యవస్థాపకత) జాహిద్ అక్బర్ షేక్‌లు సంతకాలు చేశారు. మహిళలు నడిపే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను (ఎంఎస్‌ఎంఈలు) ముందుకు తీసుకెళ్లడంలో, ఈ ప్రాంత వృద్ధిని వేగవంతం చేయడంలో ముందడుగు వేసేందుకు ఇది కీలకం కానుంది. కార్యక్రమంలో వీ హబ్ సీఈవో పి.సీత, వీడీసీ కోచ్‌లు, ఈ-క్లబ్ సభ్యులు, అధ్యాపకులు, విభాగాధిపతులు, బీబీఏ విద్యార్థి వలంటీర్లు పాల్గొన్నారు.

తపాలా.. భళా



- నేటికీ తగ్గని ప్రజల ఆదరణ
- సాంకేతిక పరిజ్ఞానంతో ముందడుగు
- విస్తరిస్తున్న మొబైల్ సేవలు
- ఒక్క క్లిక్‌తో ఇంటి వద్దకే సర్వీస్
- మెదక్ జిల్లాలో 285 పోస్టాఫీసులు

మెదక్ అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగుతోంది. ప్రజలకు సేవలందించడంలో తగ్గేదేలా అన్నట్లుగా తన పరిధిని విస్తరించుకుంటూ పోతుంది. పాతతరం పద్ధతులను పక్కనపెట్టిన నూతన ఒరవడితో ప్రత్యేకతను చాటుకుంటోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా వినియోగదారుల ఆలోచనలకు తగ్గట్టుగా సేవలందిస్తోంది. ఎన్నో రకాల కొరియర్ సర్వీసులు అందుబాటులోకి వస్తున్నప్పటికీ నేటికీ తపాలా శాఖ ద్వారానే ఉత్తరాలు, పార్సిల్‌లు ప్రజలకు అందుతున్నాయంటే అతిశయోక్తి కాదు. ఆధార్ నుంచి పాస్‌పోర్టు వరకు ఎన్నో సేవలను అందిస్తూ.. వినియోగదారులకు మరింత చేరువవుతోంది.

నూతన పద్ధతులతో..

డిపాజిట్ల సేకరణలో నూతన పద్ధతులను అవలంబిస్తోంది. తపాలా శాఖ ఓ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చి, దాని ద్వారా దాదాపు ఎనిమిది రకాల సేవలను పొందే సౌకర్యం కల్పించింది. యాప్ ద్వారా ప్రీమియం, వివిధ రకాల డిపాజిట్లపై వడ్డీ లెక్కలు వెంటనే తెలుసుకునే అవకాశం ఉంది. ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్లేస్టోర్ ద్వారా డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీని ద్వారా సుకన్య సమృద్ధి యోజన పథకంతోపాటు రికరింగ్ డిపాజిట్‌లో ఏడాది నుంచి ఐదేళ్ల వరకు చేసే డిపాజిట్లపై ఆదాయాన్ని తెలుసుకోవచ్చు.

అందిస్తున్న సేవలివే..

ప్రాంతాల పిన్‌కోడ్ ఆధారంగా మనకు కావాల్సిన పోస్టాఫీసు ఎక్కడ ఉంది. ఏ డివిజనలో ఉంది. ఏ ప్రధాన తపాలా కార్యాలయం పరిధిలో ఉందో ఇట్టే తెలుసుకోవచ్చు. పోస్టేజీ కాలిక్యులేటర్ ద్వారా వినియోగదారులు పంపిచే పార్సిళ్లు, పోస్టల్ కవర్లు, ఎంత బరువుకు ఎంత చెల్లించాలి, సాధారణ స్పీడ్ పోస్టుల్లో పంపిస్తే ఎంత ఖర్చు అవుతుందనే విషయాన్ని సులభంగా స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఫీడ్‌బ్యాక్ ద్వారా పోస్టల్ సేవలకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే వివరంగా తెలుసుకునే అవకాశం ఉంది. సలహాలు, సూచనలు ఇచ్చే అవకాశం కూడా కల్పించింది. ఇంట్రస్ట్ కాలిక్యులేటర్ ద్వారా ఏ పథకానికి ఎంత వడ్డీ వస్తుంది.. ఎంత మొత్తం పొందవచ్చు. ఆర్టికల్ ట్రాకింగ్ వినియోగదారులు పంపిన స్పీడ్ పోస్టు, రిజిస్టర్ పోస్టు, పార్సిల్, ఈఎంవో ఎక్కడ ఉన్నాయి.. ఎప్పుడూ చేరతాయో తెలుకునేందుకు ఇది ఉపయోగపడుతోంది. కంప్లైంట్ ట్రాకింగ్ ద్వారా వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదులు ఏ దశలో ఉన్నాయి.. దానికి సంబంధించిన సమాచారం ఇంకా ఏవైనా కావాలా అనే అంశాలు తెలుస్తాయి. ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా తపాలా శాఖ అందిస్తున్న వివధ రకాల బీమా పథకాల సమాచారం తెలుస్తోంది. సర్వీస్ రిక్వెస్ట్ ద్వారా ఇంటి వద్ద లభించే సేవల సమాచారం తెలుసుకోవచ్చు.

ఇంటి వద్దనే సేవలు...

ప్రజలు పోస్టాఫీస్‌కు రాకుండానే ఇంటి వద్దనే సేవలు అందించే విధంగా తపాలా శాఖ నూతన పద్ధతులను తీసుకొచ్చింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నెట్‌వర్క్‌లను ప్రజలకు చేరువ చేసింది. గతంలో వయోవృద్ధులు పోస్టాఫీసు వద్ద క్యూలో నిలబడేవారు. అయితే ప్రస్తుతం తపాలా శాఖ అందిస్తున్న సేవలతో ఇంటి వద్దనే పోస్ట్‌మెన్‌లతో సేవలు పొందుతున్నారు. డబ్బు చెల్లించడం నుంచి డబ్బు విత్‌డ్రా, ట్రాన్స్‌ఫర్ తదితర వాటిని ఆన్‌లైన్‌లోనే పూర్తి చేసుకుంటున్నారు. వినియోగదారులకు ఎటువంటి సేవలు కావాలో సమీప పోస్టాఫీసులో తెలుసుకోవచ్చు.



మెదక్ ప్రధాన తపాలా కార్యాలయం

సేవలను వినియోగించుకోవాలి..



తపాలా శాఖలో అందరికీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇంటి వద్దకే సేవలు అందిస్తున్నాం. చిన్నారుల దగ్గర నుంచి వయోవృద్ధుల వరకు వివిధ రకాల పథకాల సేవలు పొందవచ్చు. డిపాజిట్లపై మెరుగైన వడ్డీ వస్తుంది. ఎన్ని వచ్చినా తపాలాశాఖకు వచ్చే ప్రజల సంఖ్య తగ్గడం లేదు. ఆధార్ సెంటర్‌ను కూడా ప్రారంభించాం. సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

-శ్రీహరి, మెదక్, డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్

అంతర్జాతీయ కార్మిక సంస్థ సదస్సుకు మల్లేశం



మల్లేశం

సంగారెడ్డి అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కార్మిక సంస్థ సదస్సుకు భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఈపీఎఫ్ సెంట్రల్ బోర్డు సభ్యులు సుంకరి మల్లేశం ఎంపికయ్యారు. ప్రపంచంలోని 187 సభ్యదేశాలు పాల్గొనే 113 అంతర్జాతీయ కార్మిక సదస్సుకు మల్లేశంను భారత ప్రభుత్వం ఎంపిక చేయడం పట్ల బీఎంఎస్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి.మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 31 వ తేదీ నుంచి జూన్ 15 వ తేదీ వరకు జరిగే సదస్సులో కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సూక్ మాండవీయ, కేంద్ర ఉపాధి శాఖ అధికారులు, కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాల నాయకులు, కేంద్ర యాజమాన్యాల సంస్థ ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

వన్‌టైమ్ చాన్స్

- 2015-20 మధ్యలో డిగ్రీ ఫెయిలైన వారికి అవకాశం

సిద్దిపేట కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : 2015 నుంచి 2020 మధ్య డిగ్రీ చదివి ఉత్తీర్ణులు కానివారి కోసం వన్‌టైమ్ చాన్స్ కింద పరీక్షలు రాసుకోవడానికి విశ్వవిద్యాలయం కళాశాలకు అనుమతి ఇచ్చిందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి. సునిత ఒక ప్రకటనలో తెలిపారు. 5 సంవత్సరాలకు సంబంధించి ఒకటి నుంచి ఆరు సెమిస్టర్లలో ఫెయిలైన విద్యార్థులందరూ ఈ పరీక్షలు రాసేందుకు అర్హులని తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించడానికి జూన్ 20 వరకు అవకాశం ఉందని, అపరాధ రుసుముతో జూన్ 25 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. కళాశాలలోని పరీక్షల నియంత్రాణాధికారి కార్యాలయంలో పరీక్ష ఫీజు చెల్లించవచ్చునని చెప్పారు. మరిన్ని వివరాలను కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్. గోపాల సుదర్శనాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

లేబర్ కోడ్‌లతో కార్మికుల ఉనికికే ప్రమాదం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



సంగారెడ్డిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల ఉనికికే ప్రమాదంగా మారిందని దాన్ని రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర, జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహం నుంచి కొత్త బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గాలను దెబ్బతీసేందుకు లేబర్ కోడ్‌లను కరోనా కాలంలో పార్లమెంటులో అమోదించారన్నారు. ఈ కోడ్‌ల కారణంగా కార్మికులకు ఎలాంటి చిన్న సదుపాయం కూడా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 20న జరగాల్సిన దేశవ్యాప్త సమ్మె దేశంలో యుద్ధ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జూలై 9కి వాయిదా వేసినట్లు చెప్పారు. కారక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ. సాయిలు, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, సీఐటీయూ నాయకులు బాగారెడ్డి, ప్రవీణ్, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాఫ్ట్‌బాల్ లీగ్ పోటీలు



తూప్రాన్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

తూప్రాన్, మే 20 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాలుర సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నాయి. రెండోరోజు మంగళవారం లీగ్ దశ పోటీలు ముగిసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నారాయణగుప్తా తెలిపారు. లీగ్ దశ పోటీల్లో వివిధ జిల్లాల జట్లు పోటీ పడ్డాయి. పోటీల్లో మెదక్, నిజామాబాద్, వరంగల్, హనుమకొండ, మంచిర్యాల, నిర్మల్, కొత్తగూడెం, మహబూబ్‌నగర్ జట్లు క్వార్టర్ ఫైనల్ పోటీలకు అర్హత సాధించినట్లు వివరించారు.



శ్మశానటికకు దారేది?

- వర్షాలకు కొట్టుకుపోయిన వంతెన

రామచంద్రాపురం టౌన్ మే 20 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన శ్మశానవాటికకు ఆనుకొని కాలువ ఉంది. అంతిమసంస్కారాలకు వెళ్లాలంటే వంతెన దాటాల్సి ఉంటుంది. ఎవరైనా గ్రామస్థులు చనిపోయిన సందర్భాల్లో పాడే మోసుకుంటూ కాలువపై నిర్మించిన వంతెన పైనుంచి నడుచుకుంటూ వెళ్తుండేవారు. ఏడాది క్రితం కురిసిన వర్షాలకు వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. గ్రామానికి ఆదాయం అంతంతమాత్రంగా ఉంది. దాన్ని నిర్మించకుండా అలానే వదిలిపెట్టారు. దీంతో శ్మశానవాటికలోకి వెళ్లేందుకు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది గ్రామంలో విడుదలయ్యే చెత్తను కాలువలో పోసి దారిని ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం అందులోనుంచే పాడే మోసుకుంటూ లోనికి నిదానంగా వెళుతున్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో తీవ్ర అవస్థలు పడుతున్నారు. వంతెన నిర్మించాలంటే రూ.40 లక్షలు ఖర్చవుతుందని పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి చెప్పారు.

నల్లబ్యాడ్జీలతో 'ఆరోగ్య మిత్ర'ల నిరసన



జీజీహెచ్‌లో నల్లబ్యాడ్జీ . దరించి విధులకు హాజరైన ఆరోగ్య మిత్ర

సంగారెడ్డి అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు మళ్లీ నిరవధిక సమ్మెలో వెళ్లే యోచనలో ఉన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని గతేడాది ఆరోగ్య మిత్రలు సమ్మె చేశారు. ఆ క్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోగ్య మిత్రలకు డాటా ఎంట్రీ ఆపీసర్ క్యాడర్ హోదా కల్పిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు అమలు కాకపోవడంతో మళ్లీ ఆరోగ్య మిత్రలు సమ్మె చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య మిత్ర హిమగిరి ప్రసాద్ మాట్లాడుతూ మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలని లేకపోతే విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తామని తెలిపారు.

64 ఏళ్ల వయస్సులో పీహెచ్‌డీ



సంగారెడ్డి అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ఖాన్‌జమల్‌పూర్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల నర్సింలుబాబు 64 ఏళ్ల వయస్సులో పీహెచ్‌డీ సాధించారు. ఈ మేరకు ఉస్మానియా వర్సిటీ నుంచి జియాలజీ విభాగంలో డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. హైదరాబాద్‌లోని మిషన్ భగీరథ శాఖ ప్రధాన కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా(జియాలజీ) ఆరేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేసిన ఎర్రోళ్ల నర్సింలుబాబు భూగర్భ శాస్త్ర ప్రొఫెసర్ జి.ప్రభాకర్ పర్యవేక్షణలో 'వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలోని గంగకత్వ ప్రవాహ బేసిన్‌లో ఒకేలాంటి జల, వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్న లాటరైట్, బసాల్ట్, గ్రానైట్ రాతి నిర్మాణాలపై మైనర్ ఇరిగేషన్ చెరువుల సామర్థ్యాన్ని అంచన వేయడం' అనే అంశంపై పరిశోధన చేశారు.

సర్కారు దవాఖానాలకు బ్రాండింగ్

(5వ పేజీ తరువాయి)

సీటీ, ఎంఆర్‌ఐ స్కాన్‌లు, బ్లడ్ కాంపోనెంట్ సపరేటర్ ఉండేలా సమకూర్చుతారు. అంతే కాకుండా అడ్మినిస్ట్రేటివ్ వింగ్ పరంగా మార్పులు చేర్పులు చేస్తారు. తొలుత బ్యాండింగ్ చేయాల్సిన ఆస్పత్రులను టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు పర్యటించి ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, కల్పించాల్సిన వసతులపై ఆరా తీసి నివేదిక రూపొందిస్తారు. ఆ తర్వాత ఉన్నతాధికారుల ఆమోదంతో పనులు ప్రారంభిస్తారు. కాగా రెండు నెలల్లోనే ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో బ్రాండింగ్ పనులు చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఏదేమైనప్పటికీ బ్రాండింగ్‌తో ఆయా ఆస్పత్రుల్లో అత్యాధునిక హంగులు రూపుదిద్దుకోనున్నాయి.

జవాన్ల కుటుంబాలకు అండగా ఉంటాం

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- మెదక్‌లో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని. మన దేశ సైనికులకు సంఘీభావంగా మంగళవారం సాయంత్రం మెదక్‌లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మువ్వన్నెల జెండాలను పట్టుకొని స్థానిక గుల్షన్‌క్లబ్ నుంచి ప్రారంభమై రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో ఎంపీ రఘునందన్‌రావు పాల్గొన్నారు. వందేమాతరం, భరత్‌మాతకీ జై అంటూ నినాదాలు మర్మోగాయి. పహల్గాం దాడిలో అరుమలైన వారిని, యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్లు స్మరిస్తూ.. రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ఉగ్రవాదులు భారతవైపు కన్నెత్తి చూడకుండా జవాబిచ్చామన్నారు. దేశ భద్రత, దేశ ప్రజల రక్షణ కోసం సరిహద్దుల్లో కవచంగా మారి కాపలా కాస్తున్న వారికి కోసం, దేశ కోసం వీర మరణం పొందిన జవాన్ల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. భారత్ జోలికొస్తే తరిమికొడతామన్నారు. ఆడబిడ్డల సిందూరాన్ని తుడచాలని చూస్తే.. ప్రపంచ పటంలో పాకిస్థాన్‌ను లేకుండా చేస్తామన్నారు. పదేండ్ల కాలంలో దేశం మేకిన్ ఇండియా పేరిట గన్‌ల నుంచి మిసైల్స్ వరకు మన భాగ్యనగరంలోనే తయారు చేసుకుంటున్నామన్నారు.మోదీ నాయకత్వంలో మేకలు కూడా పులుల వలే పోరాడుతాయనడానికి పహల్గాం ఘటననే నిదర్శమనమన్నారు దేశంలో గూఢాచారులు ఉన్నారని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానం వస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, సీనియర్ నాయకులు పంజా విజయ్, రాగి రాములు, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు కాశీనాథ్, సతీష్‌పటేల్, సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు ప్రసాద్, నాయకులు రాము, మల్లారెడ్డి, శీణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దరోడ్డు ఇంకెప్పుడో?



సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల శివారులో ప్రమాదకర ప్రయాణం

(5వ పేజీ తరువాయి)

వెలువడటంతో వాహనాలకు దారి కానరావడం లేదు. ఇక రోడ్డు పక్కన నిర్మించిన డ్రైనేజీల్లో వాహనాలు కూరుకుపోతున్నప్పటికీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. దుమ్మూధూళిని నియంత్రించేలా నీళ్ల చల్లడం లేదు. ఇప్పటికే పలువురి మృత్యువాతకు కారణమైన ఈ రహదారి పనులకు మరెంత మంది ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తుందనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

నత్తనడకన పనులు

రెండేళ్ల వ్యవధిలోనే ఈ పనులు చేపట్టాలని అప్పట్లో లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ రెండున్నరేళ్లు గడుస్తున్నా పనులు సాగుతూనే ఉన్నాయి. మరో ఏడాది గడిస్తేనే హైవే నిర్మాణం పూర్తయ్యేలా కనిపిస్తోంది. సిద్దిపేట, హుస్నాబాద్ పట్టణాల్లో డ్రైనేజీ నిర్మాణ పనులను అస్తవ్యస్తంగా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం త్వరితగతీన భూసేకరణ చేసి కాంట్రాక్టర్లకు అప్పగించింది. కానీ పనులు పూర్తి చేయడంలో మాత్రం వేగిరపడట్లేదనే విమర్శలు ఉన్నాయి. మూలమలుపులు, ఎత్తుపల్లాల రోడ్లు ఈ హైవే నిర్మాణంలో భాగంగా వెక్కిరిస్తున్నాయి.



హుస్నాబాద్ డిపోక్రాస్ వద్ద ప్రమాదకరంగా డ్రైనేజీ



కోహెడ మండలం సముద్రాల క్రాసింగ్ వద్ద పూర్తికాని ప్యాచ్ వర్క్ పనులు

న్యూస్ బాక్స్

నిధుల మంజూరు కోసం కేంద్రమంత్రికి వినతి



కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బెజ్జంకి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లి, బెజ్జంకి గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు దోనె అశోక్ కోరారు. మంగళవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్‌ని ఆయన మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం అభివృద్ధి పనులకు ఎంపీ నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై బండి సంజయ్ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అజయ్ వర్మ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సులభతర విద్యా బోధన అందించాలి

మద్దూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యపై మక్కువ కలిగేలా చేస్తూ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు పాటుపడుతూ నాణ్యమైన విద్యను అందించాలని ధూళిమిట్ట, మద్దూరు ఎంఈవోలు మీనాంజనేయులు, వరదరాజులు సూచించారు. మంగళవారం మద్దూరులోని ఆదర్శ పాఠశాలలో వేర్వేరుగా ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణా కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. వచ్చేవిద్యాసంవత్సరంలో విద్యార్థులకు ఇక కొత్త వాతావరణంలో విద్యను అందించుటకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని పూర్తి స్థాయిలో సమయాత్తం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధూళిమిట్ట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక సీజ్

ధూళిమిట్ట, మే20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలపల్లి గ్రామంలో వ్యవసాయ బావుల, ఇళ్ల దగ్గర నిల్వ ఉంచిన దాదాపు 100 ట్రాక్టర్ల ఇసుకను మంగళవారం తహసీల్దార్ మధుసూధన్ సీజ్ చేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ..ామ ప్రజలు, ఇతర వ్యక్తులు ఎవరూ కుడా తరలించే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ఒకవేళ ఎవరైనా తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. సీజ్ చేసిన ఇసుకను వేలం వేసే వరకు గ్రామ ప్రజలు,ఇతర వ్యక్తులు ఏవరు కుడా తరలించే ప్రయత్నం చేయవద్దనీ సూచించారు.ఒకవేళ ఏవరైనా తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు.

వారాంతపు సంత.. తప్పని చింత

- రోడ్డు పక్కన ప్రమాదకరంగా నిర్వహణ
- ఆదమరిచినా, వాహనం అదుపుతప్పినా అంతే సంగతి..



సంత వద్ద వాహనాల రాకపోకలు

చేర్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలో ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న వారాంతపు సంతలో ప్రమాదం పొంచి ఉంది. జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారి పక్కనే చిరువ్యాపారులు, రైతులు పళ్లు, కూరగాయలు, ఇతరత్రా వస్తు, సామగ్రి విక్రయాలు చేపడుతున్నారు. దీంతో వాహనాల రాకపోకల నడుమ ఎవరు ఆదమరిచినా, వాహనం ఏమాత్రం అదుపుతప్పినా ప్రాణాపాయం పొంచి ఉంది. చేర్యాల పట్టణంలో ఎన్నేయేళ్లుగా అంగడి బజారులో సంత జరిగేది. నానాటికీ సంత విస్తరిస్తుండటంతో షాదీఖానా, ప్రగతి విద్యానికేతన్, ఓల్డ్ ఎస్‌బీఐ వీధులతో పాటు జనగామ సిద్దిపేట ప్రధానరహదారి పక్కన కొనసాగుతూవస్తుంది. దీంతో ఆయా పరిసరాలన్నీ ప్రజలు, వాహనాల పార్కింగ్‌తో అడ్డదిడ్డంగా నెలకొంటుండటంతో ఎటువైపు నుంచి ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన చెందుతున్నారు. పలువురు ర్యాష్‌డ్రైవింగ్ చేస్తుండటంతో పాటు మూలమ లుపులు, డివైడర్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు జరుగుతుండటంతో భయానకపరిస్థితులు నెలకొన్నాయి. దీంతో మంగళవారం వచ్చిందంటే చాలు పట్టణ వాసులు, ప్రయాణికులు వామ్మో అని జంకుతున్నారు. మున్సిపల్, పోలీసు అధికారులు సమన్వయంతో వ్యవహరించి సంతలో ప్రమాదకరపరిస్థితుల నివారణకు, ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



డిప్యూటీ తహసీల్దార్ రఘువీరారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణమూర్తి

సిద్దిపేట రూరల్ /జగదేవ్‌పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ మరాఠీ కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేసి డిప్యూటీ తహసీల్దార్ రఘువీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ మండల కన్వీనర్ మరాఠీ కృష్ణమూర్తి మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు నేడు ముప్పు వాటిల్లిందని అన్నారు. కార్పోరేట్ల ప్రయోజనాల కోసం నాలుగు కోడ్లను అమలులోకి తీసుకురావడం విడ్డూరమని పేర్కొన్నారు. కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్‌ను కఠినతరం చేసి కార్మిక సంఘాలను రద్దు చేసేందుకు కేంద్రం కుట్ర పన్నిందన్నారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి కనీసం 200 రోజులు పని కల్పించాలని రోజుకు 600 రూపాయల కూలీ చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు లోకుల నర్సింలు, లింగాల యాదయ్య, కనకమ్మ, గొల్లపల్లి కిష్టయ్య, గొల్లపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట రూరల్

కేంద్ర ప్రభుత్వం తెస్తున్న నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తునికి మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ముందు ఈ సందర్భంగా సీఐటీయూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తునికి మహేష్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇరవై తొమ్మిది కేంద్ర కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు.

గజ్వేల్

కార్మికులను బానిసలుగా మార్చే కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ రోడ్డు చౌరస్తాలో కార్మిక కోడ్‌లకు వ్యతిరేఖంగా ప్లకార్డులతో నిరసన తెలిపారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

సిద్దిపేట అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాల నాయకులు కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వ తీర్పు నిరసనగా మంగళవారం అఖిలభారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల నుండి బీజేఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు గోపాలస్వామి లక్ష్మణ్, మల్లేశం మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా చేయడానికి కార్మిక చట్టాలు రద్దు పరిచి నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందని వీటిని వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాసి యజమాన్య అనుకూల విధానాలను తీసుకువచ్చారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను రద్దుచేసి తిరిగి 29 చట్టాలను రక్షించుకునేందుకు కార్మిక వర్గం విశాల ఐక్యవేదికతో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

చేనేత కుటుంబానికి ఆర్థిక సహాయం

దుబ్బాక, మే20(ఆంధ్రజ్యోతి): దుబ్బాక పట్టణంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికులు బాల్‌రాజ్ కుటుంబానికి మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేందుకు అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

కంటైనర్ లారీ బోల్తా

హుస్నాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన రహదారి వద్ద పెను ప్రమాదం తప్పింది. మంగళవారం తెల్లవారుజామున ఉనుక లోడుతో వెళ్ళుతున్న కంటైనర్ లారీ ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేక పోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఉనుక లోడుతో వెళ్ళుతున్న కంటైనర్ లారీ బోల్తా పడటంతో రోడ్డుపై పడిన ఉనుకను జేసీబీ సహాయంతో మరొక కంటైర్ లారీలో లోడు చేశారు.

ఘనంగా తిరంగా యాత్ర



భారత సైనికులకు మద్దతుగా పట్టణంలో తిరంగా రన్

సిద్దిపేట కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో విజయం సాధించిన భారత సైన్యానికి మద్ధతుగా సిద్దిపేట పట్టణంలో తిరంగా రన్ నిర్వహించారు. సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల నుండి ప్రారంభమైన తిరంగా రన్ మోడ్రన్ బస్టాండు నుండి డిగ్రీ కళాశాల మైదానం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు, గోల్డెన్ వాకర్స్, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం స్వేచ్ఛ వాయువులు ప్రశాంతంగా పీల్చడానికి కారణం దేశ సరిహద్దులో పహారా కాస్తున్న సైనికుల త్యాగమేనని, మన సైనికుల త్యాగం ఎంతో గొప్పదన్నారు. ప్రపంచం నివ్వరపోయే విధంగా ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి ఉగ్రవాదాన్ని సహించేది లేదని ప్రధాని నరేంద్ర మోదీ, త్రివిధ దళాలు హెచ్చరించాయన్నారు.

హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం సాయంత్రం ఆపరేషన్ సిందూర్ తిరంగా యాత్రను పార్టీలకతీతంగా ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీ చౌరస్తా నుంచి నెహ్రూ చౌరస్తా, మల్లె చెట్టు చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా వరకు జాతీయ జెండాలను చేబూని ర్యాలీ జరిపారు.

ఉనికిని కాపాడుకునేందుకే ప్రభుత్వంపై ఆరోపణలు

● గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

గజ్వేల్, మే 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకే ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి అన్నారు. గజ్వేల్ ఏఎంసీ సమావేశ మందిరంలో వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని నమ్మి రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ సర్కార్ కొనుగోలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయడంతో పాటు రైతు ఖాతాల్లోకి డబ్బులు కూడా వేగంగా జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతులను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టి ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడానికి ప్రయత్నించడం బీఆర్ఎస్ నేత ప్రతాప్‌రెడ్డికి తగదన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రతాప్‌రెడ్డి చిల్లర రాజకీయాలు మానుకొని రైతులకు మేలు చేయడానికి ప్రభుత్వానికి సూచనలు చేయాలన్నారు.

చెత్త చెత్త..



మల్లన్నసాగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్త

(5వ పేజీ తరువాయి..)

ఈ క్రమంలోనే చెత్త సమస్య రోజురోజుకు ఝటిలంగా మారుతుంది. పారిశుధ్య కార్మికులకు సంబంధించిన వేతనాలు చెల్లించి, ట్రాక్టర్లు నడిపిస్తేనే చెత్త సమస్య తీరేలా కనిపిస్తుంది. ఈ అంశంపై ప్రభుత్వం త్వరగా స్పందించాలని నిర్వాసిత గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని స్పష్టమైన గెజిట్‌ను విడుదల చేసి తమ సమస్యను పరిష్కరించాలని ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

పశువుల అక్రమ రవాణా నియంత్రణకు ఏడు చెక్ పోస్టులు : సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లా, సరిహద్దులో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని సీపీ డాక్టర్ బి.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. 24గంటలు నిరంతర పర్యవేక్షణలో ఉండేవిధంగా ప్రత్యేక చెక్ పోస్టులలో పోలీసు, పశుసంవర్ధక శాఖ సిబ్బందితో షిఫ్ట్‌ల వారిగా సమన్వయంతో విధులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందస్తు చర్యలలో భాగంగా పశువుల రవాణా విషయంలో వివాదాలు తలెత్తకుండా ప్రత్యేక చెకపోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ప్రధానంగా బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల రవాణా విషయంలో అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, చట్టవిరుద్ధంగా ఆవులు, దూడలను రవాణా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.

విద్యుత్ అధికారుల సెల్‌ఫోన్ నంబర్లు మార్పు

చేర్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): చేర్యాల డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖాధికారుల సెల్‌ఫోన్ నంబర్లు మారినట్లు ఏడీఈ వెంకట్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడీఈ 8712471335, చేర్యాల టౌన్ ఏఈ 8712471336, చేర్యాల రూరల్ ఏఈ 8712471343, కొమురవెల్లి ఏఈ 8712471356, మద్దూరు ఏఈ 8712471344, ధూళిమిట్ట ఏఈ8712471357నంబర్లలో అందుబాటులో ఉంటారని, ప్రజలు రైతులు, విద్యుత్ వినియోగదారులు గమనించగలరని కోరారు.

ఉపాధ్యాయుల శిక్షణ ప్రారంభం

కుకునూరుపల్లి/ రాయపోల్ /చేర్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని కొమురవెల్లి ఎంఈవో రమేశ్ అన్నారు. కొమురవెల్లి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఎస్‌జీటీ, ఎల్‌ఎఫ్ ఎల్ ఉపాధ్యాయులకు కస్తూర్బా పాఠశాలలో సోమవారం నిర్వహించిన వృత్యంతర శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి గుణాత్మక మార్పు తీసుకురావాలన్నారు.

కుకునూరుపల్లిలో ఐదు రోజుల పాటు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మంగళవారం కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.

రాయపోల్ మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఎంఈఓ సత్యనారాయణరెడ్డి శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమాన్ని ప్రతి ఉపాధ్యాయుడు ఉపయోగించుకొని జాతీయ విద్యా విధాన లక్ష్యాలకు అనుగుణంగా విద్యా బోధన చేయాలని సూచించారు.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్ర

మద్దూరు /చేర్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో హనుమాన్ మాలాధారణస్వాములు సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. జై శ్రీరాం, హనుమాన్ నినాదాలతో గ్రామంలోని వీధులగుండా ఊరేగింపు చేపట్టారు. అలాగే పట్టణంలోని మార్కండేయ దేవాలయ ఆవరణలోని హనుమాన్ మందిరంలో హనుమత్‌యజ్ఞం అత్యంత భక్తిప్రపత్తులతో ఘనంగాజరిపారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నేడు చేర్యాల పట్టణంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో రామాలయం నుండి ఆంజనేయస్వామి దేవాలయం వరకు శోభాయాత్ర జరపనున్నారు. మద్దూరు మండల కేంద్రంలోని రామాలయంలో హనుమాన్ భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో హనుమాన్ యజ్ఞ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



ముగిసిన శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

వర్గల్, మే 20 (ఆంధ్రజ్యోతి): వర్గల్ కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం శతఘటాభిషేకంతో ముగిసాయి. ఉదయం దేవతా మూర్తులకు 108 లీటర్ల పళ్ల రసము రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామిలతో శతకలశాలతో సహస్ర ధారాభిషేకం చేశారు.

నత్తనడకన ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులు



అసంపూర్తి నిర్మాణదశలో మోడల్ హౌస్

చేర్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): పేదలకు గూడు కల్పించాలన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. అందుకు రూ.5లక్షలు సహాయమందించేందుకు చర్యలు తీసుకున్న క్రమంలో పెరిగిన ముడిసరుకుల ధరలు, నిబంధనలు, ఇతరత్రా విషయాలలో ప్రజల్లో నెలకొన్న అపోహలు, అనుమానాలు నివృత్తి చేసేందుకు మోడల్‌హౌజ్‌ల నిర్మాణం చేపట్టింది. చేర్యాల మండలంలోని రాంపూర్, కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లి గ్రామాలను పైలట్ గ్రామాలుగా ఎంపిక చేయడంతో పనులు చేపట్టగా, పలు దశలలో కొనసాగుతున్నాయి. ప్రజలలో అవగాహన కల్పించేందుకు చేర్యాల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మోడల్‌హౌస్ భవన నిర్మాణం పనులను చేపట్టారు. నెలలు గడిచినా పూర్తి చేయకపోవడం పట్ల ప్రజల్లో అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఫిబ్రవరి 14వతేదీన జిల్లా కలెక్టర్ మనుచౌదరితో పాటు కొద్దిరోజులక్రితం అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ చేర్యాల మండలంలో పర్యటించిన సమయంలో ఇందిరమ్మ మోడల్‌హౌజ్ పనులు పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కానీ స్లాబ్‌దశలో అంసపూర్తిగా ఉండటంతో ఇంకెన్నాళ్లకు పూర్తిచేస్తారన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ఉన్నతాధికారులు స్పందించి మోడల్‌హౌజ్ భవన నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన యువజన అధికారి

సిద్దిపేట కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడలు యువజనశాఖ అధికారిగా వెంకట నర్సయ్య నూతనంగా నియమితులైన సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మను చౌదరిని మర్యాద పూర్వకంగా కలిసారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లి ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా పని చేస్తున్న ఆయనను జిల్లా కలెక్టర్ జిల్లా క్రీడలు యువజన శాఖ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఉపాధి హామీలో అవినీతిని వెలికి తీసేందుకే తనిఖీ

● అదనపు డీఆర్డీఓ బాలక్రిష్ణ

సిద్దిపేట రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అవినీతి జరకుండా ఉండేందుకు, జరిగిన అవినీతిని వెలికి తీసేందుకు సామాజిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందని అదనపు డీఆర్డీఓ బాలక్రిష్ణ తెలిపారు. మంగళవారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని రెడ్డి సంక్షేమ భవనంలో ఉపాధి హామీ పనుల పై 4వ విడత సామాజికి తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీఆర్డీఓ బాలక్రిష్ణ మాట్లాడుతూ నారాయణరావుపేట మండలం వ్యాప్తంగా రూ2,47 కోట్ల పనులు చేపట్టామని, జరిగిన పనులకు సామాజికి తనిఖీ చేపట్టడం జరిగిందని చెప్పారు. వివిధ పనుల్లో తప్పులు దొర్లినందుకు రూ.7 వేల జరిమాన విధించామని అన్నారు.

ఎంపీ నిధులతో బోరు



తంగళ్ళపల్లి గ్రామంలో బోర్ వేస్తున్న దృశ్యం

కోహెడ, మే 20 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం తంగళ్ళపల్లి గ్రామంలో కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎంపీ ల్యాండ్స్ నుండి గ్రామానికి త్రాగు నీరు సౌకర్యం బోరు కోసం రెండు లక్షల నిధులు మంజూరు చేశారని మండల బీజేపీ అధ్యక్షుడు జాలిగాం రమేష్ తెలిపారు. మంగళవారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఈ బోరు వేశారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఖమ్మం వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి మెడి రమేష్, తదితరులు ఉన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

దుబ్బాక, మే 20 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక పట్టణంలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి జీ, భాస్కర్ మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వం కార్మికవ్యతిరేఖ చట్టాలతో వారిని కట్టుబానిసగా మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. గతంలో కార్మికులు పోరాడి సాధించుకున్న 29 రకాల చట్టాలను రద్దుచేస్తూ, నాలుగు రకాల లేబర్‌కోడ్ చట్టాలను కేంద్రప్రభుత్వం తెచ్చిందన్నారు. కార్మికులు సాధించుకున్న పనిసమయాలకు విరుద్ధంగా 8నుంచి 12గంటల పని సమయాలను పెంచుతూ, లేబర్‌కోడ్ చట్టాలున్నాయన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ, కార్పోరేట్ సంస్థలను దాసోహంచేసే విధంగా కేంద్ర సాగిలాపడిందన్నారు. దీనికి నిరసనగా తాము పోరాటాలు చేపడుతామని బాస్కర్ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

కోహెడ, మే 20 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం నాగ సముద్రాల వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోళ్లపై ఆమె వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ధాన్యం ఎంత కొన్నారు. ఎన్ని లారీలు సరఫరా చేశారు, రైతులకు ఎందరికి డబ్బులు పడ్డాయని వివరాలు సేకరించారు. అనంతరం సముద్రాల గ్రామంలో ఇన్నోవేషన్ పార్క్ సందర్శించారు. ఈ పార్క్‌లో మోతుక ఆకులతో పేపర్ ప్లేట్స్ తయారీ, జూట్ బ్యాగుల శిక్షణ, వెస్ట్ పేపర్ తో పెన్సిల్, పెన్నుల తయారీ, వెస్ట్ ప్లాస్టిక్ తో టీషర్స్, టైల్స్, కుర్చీలు తయారు చేస్తుంటారని చెప్పారు. భవిష్యత్తులో మరి కొన్ని స్టార్ట్ అప్ కంపెనీలు ఇక్కడికి వస్తాయన్నారు.

అలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ మండల కమిటీ



మండల కమిటీ సభ్యులతో అలయన్స్ సంస్థ ప్రతినిధులు

కుకునూరుపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ అలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ కుకునూరుపల్లి మండల కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో పోల్కంపల్లి నరేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్‌కు కుకునూరుపల్లి మండల కమిటీని ఎన్నుకున్నారు. జోనల్ చైర్మన్‌గా పోల్కంపల్లి నరేందర్‌ను, మండల అధ్యక్షుడిగా మిట్టపల్లి రుషి, సభ్యులుగా శ్రీకాంత్‌రెడ్డి, నరసింహాచారి, కనకయ్య, మల్లం ఐలయ్య, సుదర్శన్‌చారి తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజ సేవ, ఆపదలో ప్రజలను ఆదుకోవాలని సదుద్దేశంతోనే ఈ సంస్థను స్థాపించడం జరిగిందని, దేశ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టామని, సిద్దిపేట జిల్లాలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి నిరుపేదలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు.